6

సాగర్ ఎయిర్‌పోర్టుకి ఆమోదం

- 500 ఎకరాలు సేకరించాలని నిర్ణయం
- అటవీశాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు

ప్రభుత్వ భూములను ఆక్రమించారు

- 'బొల్లా'పై మంత్రి అనగానికి చీఫ్ విప్ జీవీ ఫిర్యాదు

సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల తత్కాల్ కోటా సవరణ

8

108 ఉద్యోగులకు ఊరట



- జీతాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం

రైల్వే ట్రాక్‌ల సమీపంలో పతంగులు ఎగురవేయొద్దు

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువతకు డీఆర్ఎం రామకృష్ణ హెచ్చరిక

ఇంకెన్నాళ్లు..

రేషన్ డోర్ డెలివర్రీ

రేషన్ కోసం... ఎదురుచూపులు.. ఎండీయూ ఎప్పుడు వస్తుందో.. ఎక్కడ ఉంటుందో.. ఏమి ఇస్తారో.. క్యూలో ఉన్న అందరికీ సరుకులు అందుతాయో.. అన్న కార్డుదారుల ఇక్కట్లు ఇంకా కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అంటూ తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థతో కార్డుదారులకు మేలు కంటే కీడే ఎక్కువ జరిగింది. కానీ గత ప్రభుత్వం ఎండీయూలను కొనసాగిస్తూనే వచ్చింది. రేషన్ సరుకులను తమకు ఖాళీ సమయంలో డీలరు వద్దకు వెళ్లి తెచ్చుకునే కార్డుదారులు ఎండీయూ వాహనం కోసం పనులు మానుకుని ఎదురుచూడాల్సి వచ్చేది. పనులు మానుకోలేని వారు ఆ నెలకు రేషన్ సరుకులను వదులుకోవాల్సి వచ్చేది. రేషన్ కష్టాలను పరిష్కరించేందుకు ఎండీయూలను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఏడు నెలలుగా అది అమల్లోకి రాలేదు. దీంతో కార్డుదారుల రేషన్ కష్టాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తమకు ఎదురుచూపు ఇక్కట్లు ఇంకెన్నాళ్లని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు.

- ఎండీయూలతో కార్డుదారులకు కష్టాలు
- ప్రభుత్వం మారినా తప్పని తిప్పలు
- నామమాత్రపు పంపిణీతో సగం మందికి డుమ్మా
- మాటలకే పరిమితమైన 'వాహనాల రద్దు' ప్రకటన
- డీలర్లు, ఎండీయూల కుమ్మక్కుతో నష్టపోతున్న లబ్ధిదారులు

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు డోర్ డెలివరీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వాహనాల కష్టాలు కార్డుదారులకు ఇప్పట్లో తొలగేలా లేవు. గతంలో సమీపం లో ఉన్న రేషన్ షాపులకు వెళ్లి నెలవారీ రేషన్ తెచ్చుకునే లబ్ధిదారులు ఇప్పుడు మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్(ఎండీ యూ) వాహనం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడా ల్సి వస్తోంది. ఆ వాహనం వచ్చే సమయానికి కార్డుదారులు లేకపోతే ఆ నెల రేషన్ అంతే సంగతులు. ఒక వేళ వాహ నం వచ్చినా, దాన్ని వీధి చివరన ఎక్కడో నిలుపుతారు. అ క్కడికి వెళ్లి ఎండలో నించుని సరుకులు తెచ్చుకోవాలి. దీం తో వృద్ధులు, మహిళలు క్యూల్లో ఉండలేక అవస్థలు పడు తుండేవారు. ఇది జిల్లా కేంద్రం, మున్సిపల్ పట్టణం. గ్రా మం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం అని ప్రచారం చేసుకుంటు న్న రేషన్ డోర్ డెలివరీ లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. అర్థరహితమైన ఈ విధానం తో రేషన్ సరుకుల డోర్ డెలివరీ కార్డుదారులకు 'పరేషాన్'గా మారింది. ఎండీయూ వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాత పద్ధతి కన్నా కొత్త విధానంలో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. వాహనం ఎక్కడకి వచ్చి ఆగితే అక్కడికే వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కార్డుదారులకు అగచాట్లు

రేషన్ డోర్ డెలివరీ విధానంతో చిరు ఉద్యోగులు, కష్టజీవులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విధానం కారణంగా నెలవారీ రేషన్ కూడా పొందలేని పరిస్థితి వచ్చిపడింది. గత వైసీపీ ప్రభుత్వం చెప్పినట్లు ఇంటింటికీ బియ్యం సరఫరా చేయకపోగా, వీధి చివరన వాహనం నిలిపి అందరినీ అక్కడికి పిలిచి గంటల తరబడి నిలబెట్టడం లబ్ధిదారులకు అదనపు సమస్యగా మారింది. గతంలో సమీపంలో ఉన్న రేషన్ షాపుకు ఎప్పుడు వీలైతే అప్పుడు వెళ్లి బియ్యం తెచ్చుకునే వీలుండేది. ఇప్పుడు రేషన్ సరఫరా వాహనం ఎప్పుడు వస్తుందా అని ఒకటో తేదీ నుంచి ఎదురు చూడాల్సి వస్తోంది. వాహనం వచ్చే సమయానికి లేకపోతే రేషన్ కోల్పోవాల్సి వస్తుంది. దీంతో వాహనం వచ్చేవరకూ పనులు మానుకుని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇలా ప్రతి నెలా పనులు మానుకుని రేషన్ కోసం పనికి, ఉద్యోగానికి వెళ్లకుండా పడిగాపులు పడాల్సి వస్తోంది. దీనివల్ల కష్టజీవులు, కార్మికులు, రైతు కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు రోజులకు రోజులు పనులు మానుకుని ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు సరుకుల కోసం ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. పోనీ.. రేషన్ వదిలేసుకుని పనికి వెళదామా అంటే కార్డు రద్దు చేస్తారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఒకవేళ ఇళ్ల వద్ద రేషన్ వాహనం కోసం ఉన్నా బియ్యం తప్పించి ఏమీ ఇవ్వడంలేదు. గతంలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉంటే రేషన్‌లో సబ్సిడీతో కందిపప్పు, నూనెలు తదితరాలను సరఫరా చేసే వారు. కానీ వైసీపీ ప్రభుత్వ

(మిగతా 8వ పేజీలో)



గుంటూరు పట్టాభిపురంలో ఎండీయూ వాహనం వద్ద కార్డుదారుల క్యూ

ప్రకటనలోనే.. రద్దు

ఎండీయూ విధానంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో వాటిని రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. స్వయంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాత విధానాన్నే అమల్లోకి తీసుకువస్తాం.. కార్డుదారుల కష్టాలు తొలగిస్తాం.. అని ప్రకటించారు. అయితే నెలలు గడుస్తున్నా ఆయన మాటలు ప్రకటనలకే పరిమితమైపోయాయి. కార్డుదారుల కష్టాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఎండీయూ విధానంలో లబ్ధిదారులకు రేషన్ ఎగవేతకు అవకాశం పెరగడం.. బియ్యం మాఫియా హవాతో వాహనదారులు చెలరేగిపోతున్నారు.

గత విధానమే మేలంటున్న లబ్ధిదారులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 17,01,948 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 45లక్షల మంది రేషన్ పొందుతున్నారు. అందుకోసం 3,200 రేషన్ డిపోలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానం కారణంగా నెలవారీ రేషన్ నష్టపోవాల్సి వస్తోంది. పాత విధానంలో పదిరోజులపాటు సమీపంలోని రేషన్ షాపుల్లో రేషన్ ఇచ్చేవారు. వీలైన సమయంలో లబ్ధిదారులు అక్కడికి వెళ్లి రేషన్ తెచ్చుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ సరఫరా చేయాలని పౌర సరఫరాల అధికారులు చెబుతున్నా ఎండీయూ వాహనదారులు, డీలర్ల కుమ్మక్కుతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పాత విధానంలోనే రేషన్ సరుకులు కావాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

మరణానంతరం శరీరాన్ని దానం చేస్తా

- పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే వెల్లడి
- గోఖలేను ఆదర్శంగా తీసుకోవాలన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

గుంటూరు మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'ప్రజలను అవయవదానం చేయమని చెప్పడమే కాదు.. మనం చేసి చూపించాలి. నాకు అవయవదానం చేసే ధైర్యం ఉంది.. మీకు ఉందా? మరణానంతరం నా దేహాన్ని గుంటూరు వైద్య కళాశాలకి డొనేట్ చేస్తా..' అని పద్మశ్రీ అవార్డుగ్రహీత, గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణగోఖలే ప్రకటించారు. సావిత్రిబాయిపూలే జయంతి పురస్కరించుకుని శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన అఖిల భారత శరీర, అవయవదాతల సంఘం ఐదో మహాసభలో గోఖలే ప్రసంగించారు. సంఘం సావనీర్‌ను, సావిత్రిబాయిపూలే ఎడ్యుకేషన్ అండ్ ఛారిటబుల్‌ట్రస్ట్(స్పెక్ట్) క్యాలెండర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి, వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి తదితరులు డాక్టర్ గోఖలేకు సావిత్రిబాయిపూలే జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. బాడీ డొనేట్‌కు ముందుకు వచ్చిన గోఖలే తీరును ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి తెలిపారు. అవయవ, రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న 14 మందికి, సంస్థల ప్రతినిధులకు పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ గోఖలే మాట్లాడుతూ కుటుంబసభ్యులు బ్రెయిన్‌డెడ్‌తో మరణావస్థలో ఉన్నా ఆ బాధను దిగమించి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అవయవదానానికి ముందుకు వచ్చే కుటుంబీకులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అవయవదానం చేసే వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని సూచించారు.



డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ట్రాన్స్‌ప్లాంటేషన్ పెంచేందుకు కృషి..

రాష్ట్రంలో అవయవాల లభ్యత చాలా తక్కువగా ఉందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రతి రోజూ సగటున నాలుగు బ్రెయిన్ డెడ్ కేసులు నమోదువున్నా, అవయవదానానికి ఆయా కుటుంబ సభ్యులు ముందుకు రాకపోవడంతో అవయవ లభ్యత తక్కువగా ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ వ్యక్తులు అవయవదానం చేస్తే అంత్యక్రియలకు ప్రభుత్వ లాంఛనాలు కల్పించినట్లు తెలిపారు. లైవ్ డోనార్లకు ప్రభుత్వం రూ.10 వేలు ప్రోత్సాహక నగదు అందిస్తున్నట్లు చెప్పారు. సభలో జీవన్‌దాన్ ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి, రెవెన్యూ అధికారి సాధు నరసింహరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, జన చైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల్లో.. మహిళలొద్దు

- యార్డుల్లో చైర్‌పర్సన్ గిరిపై ఎమ్మెల్యేల విముఖత
- నెల రోజులుగా పేర్లు ఇవ్వకుండా నాన్చుతున్న నేతలు
- తమ వద్ద కాకుండా వేరే చోట కేటాయించుకోవాలని సూచన
- ఖరారు కాని రిజర్వేషన్లు.. పాలకవర్గాల నియామకాల్లో జాప్యం

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో చైర్‌పర్సన్ పదవిని మహిళకు ఇచ్చేందుకు చాలామంది ఎమ్మెల్యేలు ఆసక్తి చూపడం లేదు. కొత్త పాలకవర్గాల కూర్పు కోసం పేర్లు ఇవ్వాలని నెల క్రితమే మార్కెటింగ్ శాఖ నుంచి ఎమ్మెల్యేలకు సమాచారం వెళ్లగా నేటికీ వాటిని పంపలేదు. మార్కెటింగ్ చట్టం ప్రకారం చైర్మన్, కమిటీల్లోని పాలకవర్గ సభ్యుల పదవుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ పాటించాల్సి ఉంది. దీంతో చైర్‌పర్సన్ పదవిని తమ నియోజకవర్గంలో జనరల్‌కే కేటాయించాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. వేరే నియోజకవర్గంలో మహిళలకు రిజర్వు చేసుకోవాలని ఎవరికి వారు సూచిస్తున్నట్లు తెలిసింది. దీంతో నేటికీ రిజర్వేషన్లను ఖరారు చేయలేని దుస్థితి నెలకొన్నది. సంక్రాంతికి అన్ని మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించినా రిజర్వేషన్లలో తలెత్తిన జాప్యం కారణంగా తప్పక వాయిదా పడే పరిస్థితి తలెత్తింది.

12 కమిటీలను మహిళలకు కేటాయించాలి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 24 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. గుంటూరు జిల్లాలో గుంటూరు, ప్రత్తిపాడు, తాడికొండ, ఫిరంగిపురం, దుగ్గిరాల, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల జిల్లాలో వేమూరు, బాపట్ల, రేపల్లె, కూచిపూడి, పల్నాడు జిల్లాలో నరసరావుపేట, రొంపిచర్ల, రాజుపాలెం, సత్తెనపల్లి, క్రోసూరు, గురజాల, పిడుగురాళ్ల, మాచర్ల, చిలకలూరిపేట, దుర్గి, వినుకొండ, ఈపూరు మార్కెట్ కమిటీలున్నాయి. వాటిల్లో పల్నాడు జిల్లాలో 12, గుంటూరులో 8, బాపట్లలో నాలుగు ఉన్నాయి. వీటిల్లో 12 కమిటీల చైర్మన్ పదవులను మహిళలకు కేటాయించాలి. అలానే ఒక్కో కమిటీలో 15 మంది సభ్యుల్లోనూ 50 శాతం సీట్లు మహిళలకు రిజర్వు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో నియమించిన పాలకవర్గాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రాజీనామాలు చేయించింది. అప్పటి నుంచి పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. కొత్త కమిటీలను నియమించేందుకు రిజర్వేషన్లను ఖరారు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు ఖరారు జరిగి పేర్లు మార్కెటింగ్ శాఖకు వెళ్లి ఆ తర్వాత జీవో వచ్చేసరికి నెలల సమయం పట్టే అవకాశం లేకపోలేదు.



జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజేత విజ్ఞాన్



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు(విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో 18వ ఎడిషన్ మహోత్సవ్ 25లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజేతగా విజ్ఞాన్ యూనివర్సిటీ నిలిచింది. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలపై విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచి ఛాంపియన్స్‌గా నిలిచారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. జట్టులో కెప్టెన్ తరుణ్ మల్ల 3 ఫోర్లతో 31 పరుగులు, అఫ్రీద్ ఖాన్ 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 22 పరుగులు, అభిషేక్ 18 పరుగులు, మాటిన్ 14 పరుగులు చేశారు. నరసరావుపేట కాలేజీ బౌలర్ మనోహర్‌కు 3 వికెట్లు లభించాయి. అనంతరం 100 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 74 పరుగులు మాత్రమే చేసి 25 పరుగుల తేడాతో ఓటమి చెందింది. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్ బ్యాట్స్‌మెన్‌లలో కెప్టెన్ అమర్ష్ 15, జయంత్ 14, షారుఖ్ ఖాన్ 12, జశ్వంత్ 12 పరుగులు చేశారు. విజ్ఞాన్ యూనివర్సిటీ బౌలర్లలో కెప్టెన్ తరుణ్ మల్లా, హర్షా చౌదరి, శుభం కుమార్, ఆకాష్, అభిషేక్ చెరో వికెట్ సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు. మూడో స్థానానికి జరిగిన పోటీలో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీపై ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజీ 16 పరుగుల తేడాతో గెలుపొందింది. జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తోపాటు విన్నర్‌కు రూ.50,000, రన్నర్‌కు రూ. 30,000, మూడో స్థానంకు రూ. 20,000, నాలుగో స్థానంకు రూ.10,000 నగదు బహుమతులను అందజేస్తారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ సీహెచ్ అఫ్రీద్, బెస్ట్ బౌలర్ జి.దీపక్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా మల్ల తరుణ్ నిలిచారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ డైరక్టర్, కోచ్‌లు, మెంటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై వైసీపీ మూకల దాడి

దుర్గి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో టీడీపీ నేతపై వైసీపీ మూకలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని అడిగొప్పులలో జరిగింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత కొత్తా హనుమంతురావు శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిలో గల చర్చి ఆవరణ వద్ద ఉండగా, అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు జంగా యలమంద, శ్రీను కర్రలతో తలపై దాడి చేశారు. దీంతో హనుమంతురావు తలకు గాయమైంది. గాయపడిన హనుమంతురావు తేరుకొని వైసీపీ నేత యలమందపై కర్రతో దాడి చేయగా యలమంద చేతికి గాయమైంది. హనుమంతురావు మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఆమోదం

- భూసేకరణ దిశగా అడుగులు
- 500 ఎకరాలు సేకరించాలని నిర్ణయం
- అటవీశాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ పర్యాటక కేంద్రం నాగార్జున సాగర్‌లో విమానాశ్రయాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎయిర్‌పోర్టుల నిర్మాణాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సమీక్షించారు. ఈ సమావేశంలో నాగార్జున సాగర్‌లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. ఎయిర్ పోర్ట్ కోసం ఫీజిబులిటీ నివేదిక కూడా సిద్ధం చేశారు. నిర్మాణానికి భూసేకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 1670 ఎకరాల్లో ఎయిర్ పోర్టు నిర్మించనున్నారు. దీనిలో 1170 ఎకరాలు అందుబాటులో ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. 500 ఎకరాల భూమి సేకరించాలని భావించి, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే కావాల్సిన భూమిని గుర్తించారు. భూసేకరణపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు జిల్లా యంత్రాంగం చెబుతుంది. భూసేకరణకు ఎయిర్ పోర్టు నిర్మాణం అంశంలో అటవీ శాఖ అనుమతుల అవసరం ఉంది. ఈ మేరకు అటవీ శాఖకు కూడా ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండటం, దీనిలో తెలుగుదేశం భాగస్వామిగా ఉండటంతోపాటు రామ్మోహన నాయుడు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా సాగర్ ఎయిర్ పోర్టు నిర్మాణంపై అధ్యయనం చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను కూడా గత నెలలో ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో సాగర్ విమానాశ్రయ నిర్మాణానికి మార్గం సుగమం అయింది. అటవీ శాఖ అనుమతులు రాగానే ఎయిర్‌పోర్టుకు సంబంధించిన భూసేకరణ ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర అటవీ శాఖ అనుమతుల కోసం కృషి చేయనున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం పల్నాడు అభివృద్ధికి దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. పర్యాటక కేంద్రంతోపాటు సాగార్జున సాగర్ డ్యాం, బౌద్ధ క్షేత్రంగా కూడా ఈ ప్రాంతం విరాజిల్లుతుంది. ఎయిర్ పోర్టు నిర్మిస్తే విదేశీ పర్యాటకుల సంఖ్య సాగర్‌కు పెరిగే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్ల నాగార్జునసాగర్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం కాగా, కూటమి ప్రభుత్వ హయాంలో సాకారం కానున్నది. రాష్ట్రంలో ఏడు ఎయిర్ పోర్టులు నిర్మించాలని ప్రతిపాదించగా, దీనిలో నాగార్జునసాగర్ కూడా ఉంది.

ప్రభుత్వ భూములను 'బొల్లా' ఆక్రమించారు

- మంత్రి అనగానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఫిర్యాదు



భూ సమస్యలపై చర్చిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో తిమ్మాయపాలెం, వెంకుపాలెం, జాలలపాలెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భారీ ఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రెవెన్యూ సదస్సులు ముగింపు కార్యక్రమాల్లో భాగంగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిసోదియా, సీసీఎల్ చైర్మన్ జయలక్ష్మికి శుక్రవారం జీవీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. బొల్లాపల్లి, ఈపూరు, నూజండ్ల, వినుకొండ మండలాల్లోని గుమ్మనంపాడు, అంగలూరు, తిమ్మాపురం, వి.అప్పాపురం, కొండ్రప్రోలు, శివాపురం, నాగులవరం అగ్రహారం భూముల విషయంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నూజండ్ల, ఈపూరు మండలాల్లో ముర్తింజాపురం, పమిడిపాడు, గుండేపల్లి గ్రామాల్లో డీఫారెస్ట్ భూములకు హద్దులు నిర్ణయించాలని, పట్టాల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తన అనుచరులతో 22ఏ పేరుతో ఉన్న భూములను బెదిరించి 152 ఎకరాలకుపైగా లాక్కొన్నారని, వీటితోపాటు అటవీ, ప్రభుత్వ భూములను ఆక్రమించారని వీటిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో సమగ్ర రీసర్వే నిర్వహించడం ద్వారా భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. నిరుపేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి వినతి

చిలకలూరిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తే ప్రజలకు కూటమి ప్రభుత్వంపై మంచి నమ్మకం ఏర్పడుతుందని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రీజినల్ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిలకలూరిపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులను ప్రత్తిపాటి ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి తగిన చొరవ చూపాలని, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలని మంత్రి అనగానికి పుల్లారావు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న అర్జీల విషయంలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంపై ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అనగానికి సూచించారు. నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్‌కు సర్వే నంబర్ 482లో కేటాయించిన 108 ఎకరాలు వేరే వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయని, ఆ భూమిని వెంటనే విడిపించి ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించాలని కోరారు.

రేపు సివిల్స్ అభ్యర్థులకు మోడల్ పరీక్ష

- ఎంపికైన వారికి ఏడాది పాటు ఉచిత శిక్షణ
- డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ పి.లక్ష్మయ్య



మాట్లాడుతున్న పి.లక్ష్మయ్య, పక్కన చుక్కపల్లి రమేష్

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఈ నెల 5వ తేదీన ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ పి.లక్ష్మయ్య తెలిపారు. కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరీక్షకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పరీక్ష ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై 5 గంటల వరకు జరుగుతుందని అన్నారు. పరీక్షకు కమ్మ అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. జేకేసీ కళాశాల గుంటూరు, అశోక్‌నగర్ హైదరాబాదు, పీవీఆర్ ఎడ్యుకేషనల్ సిటీ వినుకొండలో ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అందుబాటులో ఉన్న సెంటరు పేరు, ఇతర వివరాలను 83309 34815 నంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్, న్యూ ఢిల్లీలో ఉచిత శిక్షణ, పుస్తకాలు, ట్యాబ్, వసతి, భోజనం ఏడాది పాటు అందజేస్తామని చెప్పారు. ఆ తరువాత ఆన్‌లైన్ ద్వారా రెండేళ్ల పాటు శిక్షణ అందజేస్తామని అన్నారు. కమ్మజన సేవ సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ సివిల్స్ శిక్షణకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందనీ, దీనిని ఉచితంగా అందజేస్తున్న పి.లక్ష్మయ్యను అభినందిస్తున్నట్టు తెలిపారు. పరీక్ష ద్వారా 50 నుంచి 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, మర్రిపూడి సీతారామయ్య, మేనేజర్ చావా బోస్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి

- తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



మాట్లాడుతున్న శివస్వామి, పాల్గొన్న హిందు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గన్నవరం విమానాశ్రయం సమీపంలో జరుగుతున్న హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని మోహన రంగ స్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు వచ్చే హిందువుల కోసం హిందు ధార్మిక సంఘాల ప్రతినిధులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారని తెలిపారు. 5 లక్షల మంది పాల్గొనేలా సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దామన్నారు. సభకు పలు పీఠాధిపతులు హాజరౌతున్నారని అన్నారు. హిందువులను మాత్రమే దేవాలయాలపై ధార్మిక సంఘాలుగా ఏర్పాటు చేసి, దేవదాయ ధర్మాదాయ శాఖను రద్దు చేసే లక్ష్యంలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించామని అన్నారు. ధార్మిక మండలి ఆధ్వర్యంలో దేవాలయాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకునే వరకు ఈ పోరాటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక సామరసత వేదిక రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాసరావు, డాక్టర్ కల్లగంటి నాగార్జున, నరేంద్ర గౌతమ్, రామకృష్ణ, చిరుమామిళ్ల గోపి, పెద్దింటి కృష్ణ చైతన్య, రాజగోపాల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

7న బీఎస్సీ అగ్రికల్చర్ స్పోర్ట్స్ కోటా కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్-2024 ర్యాంకు ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశాలలో మిగిలిన సీట్లకు, స్పోర్ట్స్ కోటా సీట్లకు చివరి దశలో మాన్యువల్ కౌన్సెలింగ్ ఈ నెల 7న నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. గుంటూరు సమీపంలోని లాం ఫామ్ యూనివర్సిటీలోని కృష్ణ ఆడిటోరియంలో ఉదయం ఏడు గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఏఎన్‌జీఆర్ఏయు.ఏసీ.ఐఎన్(angrau.ac.in) సంప్రదించాలని కోరారు.

కేంద్ర మాజీ మంత్రి సతీమణి మృతి

- ఆమె అల్లుడు ఒడిశా గవర్నర్ కంభంపాటి



శివప్రదాదేవి (ఫైల్)

పొన్నూరుటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎంపీగా, కేంద్రమంత్రిగా గతంలో పని చేసిన పాములపాటి అంకినీడు ప్రసాదరావు సతీమణి శివప్రదాదేవి(94) శుక్రవారం నిడుబ్రోలులో మృతి చెందారు. నిడుబ్రోలుకు చెందిన అంకినీడు ప్రసాద్, శిప్రదాదేవి దంపతులకు పాములపాటి రాజేంద్రప్రసాద్, గంగాధర్‌ప్రసాద్ కుమారులతో పాటు అనసూయదేవి, కంభంపాటి జయశ్రీ కుమార్తెలు. శివప్రదాదేవి అల్లుడు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు. ఆమె మృతి వార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల తత్కాల్ కోటా సవరణ

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల తత్కాల్ కోటాని రైల్వే శాఖ సవరించింది. నంబరు. 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 14వ తేదీ నుంచి తత్కాల్ కోటాలో ఏసీ ఛైర్‌కార్ సీట్లు 16, సెకండ్ సిట్టింగ్ 50 ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. గతంలో ఈ సంఖ్య 10, 25గా ఉండేది. అలాగే నంబరు. 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఏసీ ఛైర్‌కార్ సీట్ల తత్కాల్ కోటాని 150 నుంచి 100కి తగ్గించారు. జనవరి 10వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమలులోకి వస్తుంది. మరోవైపు సెకండ్ సిట్టింగ్ తత్కాల్ కోటాని 6కు పెంచారు.

మార్చి వరకు సంత్రగచి రైలు సర్వీసుల పొడిగింపు

ప్రతీ మంగళ, శనివారంలో బయలుదేరే నంబరు. 07221 సికింద్రాబాద్ - సంత్రగచి ప్రత్యేక రైలు సర్వీసులను ఈ నెల 7వ తేదీ నుంచి మార్చి 29వ తేదీ వరకు పొడిగించారు. అలాగే నంబరు. 07222 సంత్రగచి - సికింద్రాబాద్ (ప్రతీ బుధ, ఆదివారం) ప్రత్యేక రైలు సర్వీసులను ఈ నెల 8 నుంచి మార్చి 30వ తేదీ వరకు పొడిగించినట్లు సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ తెలిపారు.

ధర్మవరం, తిరుపతి రైళ్లకు స్టాపేజీల పెంపు

నంబరు.17215/17216 మచిలీపట్నం - ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కి రేపటి నుంచి కొండాపురంలో ఆర్నెల్ల పాటు ప్రయోగాత్మక స్టాపేజీని కల్పిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 17261/17262 గుంటూరు - తిరుపతి - గుంటూరు రైలుకు కోయిలకుంట్ల, జమ్మలమడుగులో స్టాపేజ్ కల్పిస్తున్నామన్నారు. నంబరు 07030 సికింద్రాబాద్ - అగర్తల, నంబరు. 07029 అగర్తల - సికింద్రాబాద్ రైళ్ల సర్వీసులను తదుపరి ప్రకటన వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రం, విద్యార్థుల భవిష్యత్తుని అంధకారంలో నెట్టేలా మాజీ సీఎం జగన్ నిర్ణయాలు చేశారన్నారు. విద్యారంగాన్ని తానే అభివృద్ధి చేసినట్టు జగన్మోహన్‌రెడ్డి సొంత డబ్బా కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యావ్యవస్థలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. విద్యా విధానంలో తలాతోక లేని నిర్ణయాలు జగన్ తీసుకున్నారని అన్నారు. జగన్ నియంతపోకడలతో రాష్ట్ర విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్నారు. వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్తమైన సంస్కరణలతో 12,611 పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మారాయన్నారు. దీనికి కేవలం జగన్ ఒంటెద్దు పోకడలే ప్రధాన కారణం అన్నారు.

రమేష్ హాస్పిటల్స్‌లో రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత సామాజిక బాధ్యతగా జనవరి 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ప్రాంగణంలో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంతో గుండె, మెదడు, నరాలు, పక్షవాతం, జీర్ణకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల, కిడ్నీ సంబంధిత వ్యాధులు, జ్వరాలు, సంక్రమణ వ్యాధులు, చిన్న పిల్లల, స్త్రీ, ప్రసూతి వ్యాధులు, సంతాన సాఫల్యత సమస్యలు, షుగర్, థైరాయిడ్, రక్తపోటు వంటి సమస్యలపై సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు సేవలు అందిస్తారని ఆయన వివరించారు. శిబిరంలో అవసరమైన రోగులకు బీపీ, బీఎంఐ, షుగర్, ఈసీజీ, గుండె స్కానింగ్, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొనదలచిన వారు ముందస్తుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, పాత వైద్యపరీక్షల రిపోర్టులను వెంట తీసుకురావాలని డాక్టర్ రమేష్‌బాబు కోరారు. ముందుగా అపాయింట్‌మెంట్ కోసం 0863-2377777 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య

చిలకలూరిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధం నేపథ్యంలో పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పాలపర్తి నాగరాజు అలియాస్ తిమ్మిరి (40) అనే వ్యక్తి గురువారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగరాజు పట్టణంలోని డైక్‌మెన్ కాలనీకి చెందిన అక్కల చెంచయ్య భార్య నన్నీతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. భర్త చెంచయ్యను వదిలేసిన నన్నీ నెల రోజులుగా నాగరాజుతో కలిసి పట్టణంలోని సుభానినగర్‌లో ఒక ఇల్లును అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. దీంతో నాగరాజుపై నన్నీ భర్త చెంచయ్య కక్ష పెంచుకున్నాడు. చెంచయ్య తన అన్న కుమారుడు అక్కల ప్రభుదాసుతో కలిసి నాగరాజును హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. సుభానినగర్‌లో నాగరాజు ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లి చాకుతో గొంతు కోసి చంపినట్టు పోలీసులు పేర్కొన్నారు. అర్బన్ సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి

గురజాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతిచెందిన సంఘటన గురజాల పట్టణంలో చోటుచేసుకుంది. గురజాల ఆర్టీసీ బస్టాండ్‌లో 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని మహిళ మూడు నెలలుగా భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. ఈమెకు రెండు కాళ్లు పనిచేయడం లేదు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బస్టాండ్ వద్ద భిక్షాటన చేస్తుండగా మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ (గుంటూరు డిపో) బస్సు ఆమెను ఢీకొంది. ఈ సంఘటనలో యాచకురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు



నకరికల్లులో దుండగులు ధ్వంసం చేసిన ఏటీఎం

నకరికల్లు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు సర్వీస్ రోడ్డులో ఉన్న ఇండియా వన్-1 ఏటీఎంను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దొంగిలించేందుకు ఏటీఎంను పగలగొట్టారు. ఏటీఎం స్క్రీన్, కీ బోర్డు, కార్డు రైడర్‌ను దుండగులు ధ్వంసం చేశారు. నగదును అపహరించే ప్రయత్నం చేశారు కాని వీలు కాక పోవటంతో దుండగులు ఏటీఎంకు సంబంధించిన వస్తువులను ధ్వంసం చేసి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఇండియా-1 ఏటీఎం గుంటూరు జిల్లా ఫ్రాంచైజ్ మేనేజర్ పోతూరి నాగ పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 569.30 అడుగులు ఉంది. ఇది 254.81 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 20,613 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,613 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 39.30 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

45,194 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,012 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,194 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,381 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500
నెంబరు. 5	8000	13500
273	8000	11000
341	8000	15000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16200
బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	8000	15500
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500
నెంబరు.5	9000	11000
273	11500	12000
341	8300	12500
4884	12000	14000
సూపర్ 10	11200	11200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16000
బ్యాడిగి	8000	12000
దేవనూరు డీలక్స్	9000	11500
తెల్లకాయలు	4000	9500



బస్సులను ప్రారంభించి పూజ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

జీఎంసీ పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి

● ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల వితరణను రాష్ట్రంలోని ఇతర వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.. శుక్రవారం గుంటూరు వైద్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జీఎంసీ 1999వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.75 లక్షలతో విరాళంగా అందజేసిన రెండు కాలేజీ బస్సులను మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. గుంటూరు వైద్య కళాశాలలో చదివి ఉత్తర అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు (జింకానా) గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి, వైద్య కళాశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. రూ.86 కోట్లతో ప్రభుత్వాస్పత్రిలో మాతా,శిశు సం రక్షణ కేంద్రంతో పాటు రూ.20 కోట్ల వ్యయంతో పొదిలి ప్రసాద్ జింకానా బ్లాక్‌పై మరో రెండు అదనపు అంతస్తులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు గుంటూరుకు చెందిన పారిశ్రామిక వేత్త తులసీ రామచంద్రప్రభు రూ.10 కోట్ల వ్యయంతో సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి ముందుకు వచ్చారని, మహమ్మద్ ఖాన్ కంపెనీ రూ.5 కోట్లతో జీజీహెచ్‌లో కొత్త వార్డు నిర్మాణానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలి పారు. రెండు బస్సులను విరాళంగా అందజేసిన 99వ బ్యాచ్‌కు చెందిన దాతలు డాక్టర్ భవనం హనుమా శ్రీనివాస రెడ్డి, డాక్టర్ టీ సదా శివ రావు, డాక్టర్ బీ ప్రభా కర రెడ్డి, డాక్టర్ ఎం రాజేష్, డాక్టర్ యర్రా నరేష్‌రెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్ భూక్యా, డాక్టర్ డీ మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ఎం హనుమంతరావును మంత్రి సత్కరించారు.

ఆధునిక హంగులతో పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం

● ఎమ్మెల్యే మాధవి,కమిషనర్ శ్రీనివాసులు



వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కమిషనర్

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకే నాయుడు మార్కెట్‌ను ఆధునిక హంగులతో నిర్మించనున్నట్లు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ,జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. మార్కెట్ నిర్మాణంపై నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్యే, కమిషనర్ అధ్యక్షతన గురువారం సమీక్షా సమావేశం జరిగింది. నూతన మార్కెట్‌ని నిర్మిస్తున్న సందర్భంగా వ్యాపారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆధునిక హంగులతో నిర్మిస్తున్న మార్కెట్‌ను గురించి వారికి వివరించారు. కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్లో తమకు 374 షాపులు కేటాయించాలని వ్యాపారులు కోరారు. మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యామ్నాయ ప్రదేశం చూపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే, కమిషనరు మీడియాతో మాట్లాడారు. పీవీకే నాయుడు మార్కెట్ అభివృద్ధిలో భాగంగా డీపీఆర్ పూర్తయి, టెండర్ల ప్రక్రియ తుది దశలో ఉందని చెప్పారు. మొత్తం 152 కోట్ల వ్యయంతో, 8 అంతస్తుల్లో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఇందులో రెండు అంతస్తులు సెల్లార్‌గానూ, మరో రెండు అంతస్తులు కూరగాయల వ్యాపారులకు కేటాయిస్తామని, ఇంకో రెండు అంతస్తులు నగరపాలక సంస్థ కార్యాలయంగానూ వినియోగిస్తారని, మిగిలి అంతస్తులతో కొన్ని వ్యాపార సంస్థలు ఉంటాయని వివరించారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే రైతులు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రెండేళ్లలోపు నిర్మాణం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్కెట్ నిర్మాణం పూర్తయ్యే వరకూ కూరగాయల వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తామని చెప్పారు.

సంక్రాంతి పండగకు వన్నె తెచ్చేలా సంబరాలు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు వన్నె తెచ్చేలా ఎన్టీఆర్ స్టేడియంలో సంబరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ బోతున్నామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల నిర్వహణపై ఎన్టీఆర్ స్టేడియంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవి నేతృత్వంలో గురువారం సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను అంబరాన్ని అంటేలా నిర్వహిస్తామన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి సీఎం కృషి: ఎమ్మెల్యేలు

● 'ఇస్తామ'కు సీఎం సహకారం కోరిన ఎమ్మెల్యేలు నసీర్, ధూళిపాళ్ల



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నసీర్, ధూళిపాళ్ల నరేంద్ర

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల అభ్యున్నతికి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి శుక్రవారం ఆయన వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో నంబూరులో నిర్వహించనున్న ముస్లింల 'ఇస్తామ' కార్యక్రమానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. 'ఇస్తామ' ముస్లింలకు ఎంతో ప్రత్యేకమైందని, సుమారు లక్ష మందికిపైగా ముస్లిం లు హాజరయ్యే అవకాశం ఉందని, ప్రభుత్వం తోడ్పాటునివ్వాలని వారు చంద్రబాబుకు వివరించారు. ప్రభుత్వ సహకారం అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని నెలల్లోనే మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ముగ్గురికి విశిష్ట రైలు సేవా పురస్కారాలు

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన ముగ్గురికి విశిష్ట రైలు సేవా పురస్కారాలు లభించాయి. 69వ జోనల్ స్థాయి రైల్వే వారోత్సవంలో భాగంగా ఈ పురస్కారాలు వారికి దక్కాయి. సికింద్రాబాద్ బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో శుక్రవారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో కే సీతారామయ్య(లోకో పైలట్, గూడ్స్(డీజిల్) రైలు), కే హరి చంద్రుడు(లోకో పైలట్, ప్యాసింజర్/మోటార్ వ్యాన్ ఎలక్ట్రికల్), కే మల్లికార్జునరావు(చీఫ్ కంట్రోలర్ ఆపరేషన్స్)లు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు అధికారులను డీఆర్‌ఎం ఎం రామకృష్ణ అభినందించారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణకు
త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ కోసం త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. పారిశుధ్య పనులను పిన్ పాయింట్ గా పర్యవేక్షణ చేస్తామని, వార్డ్ సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు పారిశుధ్య పనులపై బాధ్యత వహించాలని ఆదేశించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుధ్య పనులపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా వార్డ్ సచివాలయాల ప్రాతిపదికన 802 మైక్రో ప్యాకెట్స్ ని రూపొందించామన్నారు. ప్రతి కార్యదర్శి తమ పరిధిలోని కార్మికులకు ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి, హాజరు, సెలవులు నమోదు చేయాలన్నారు. త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రతి సచివాలయం పరిధిలో జరిగే పారిశుధ్య పనులను క్షుణ్ణంగా పర్యవేక్షణ చేస్తామన్నారు. ట్రేడ్ లైసెన్స్ ల డోర్ టు డోర్ సర్వే వివరాలు ప్రత్యేకంగా యాప్ లో అప్ లోడ్ చేయాలన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ పీజే అమృతం, ఎంహెచ్ఓ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, విఏఎస్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్ఓలు ఆనందకుమార్, రాంబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఆయుబ్‌ఖాన్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

స్థానిక ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు పనులను కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. చుట్టుగుంట సెంటర్ నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్కనే ఉన్న ఆక్రమణలను తొలగించాలని, విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ పనులు చేపట్టాలని విద్యుత్ ఏఈకి సూచించారు. అనం తరం అంకిరెడ్డి పాలెం హిందూ శ్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ వెంకటేశ్వర రావు, డీఈఈలు మధుసూదనరావు, సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, ఆర్వో రెహ్మాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్, తారకరామనగర్ కాలనీల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని డీఈఈ గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహ కరించాలని కోరారు.

పాడిపరిశ్రమ పరిడవిల్లేందుకు ఎస్ ఎస్ ఎస్



రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలి

- డాక్టర్ ఓ నరసింహరావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి

గేదెలు, ఆవులకు సార్టెడ్ సెక్స్ సెమెన్ పద్ధతిలో గర్భధారణతో పాడిరైతులకు ఎనలేని ప్రయోజనం వుంటుంది. పాడి పరిశ్రమ పరిడవిల్లుతుంది. రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలి. ఇప్పటికే ఈ పద్ధతిలో గర్భధారణ చేసిన పశువులు ఆడ దూడల కు జన్మనిచ్చాయి. సాంప్రదాయ పద్ధతి కన్నా ఇది చాలా ప్రయోజనకరం.



సార్టెడ్ సెక్స్ సెమెన్ ఇచ్చిన తర్వాత పుట్టిన ఆడ దూడతో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ నరసింహారావు

- సత్ఫలితాలిస్తున్న సార్టెడ్ సెక్స్ సెమెన్ ప్రయోగం
- వై- క్రోమోజోమ్ నిర్మూలనతో 95 శాతం ఉత్తమ ఫలితం
- జిల్లాలో 4974 పశువులకు ఈ పద్ధతిలో గర్భధారణ
- పెరగనున్న పాడిరైతుల ఆదాయం

గుంటూరు సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆడ శిశువులను అంతమొందించేందుకు మను షులు చేసే అకృత్యాల గురించి ఆనోటా ఈనోటా వింటూనే ఉంటాం. పత్రికల్లోనూ, టీవీ చానల్స్‌లోనూ, సోషల్ మీడియా వేదికగానూ వచ్చే ఈ తరహా వార్తలు విస్తుపోయేలా చేస్తూనే ఉంటాయి. కానీ, పశువుల్లో మాత్రం ఆడదూడలను పెంపొందించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా ఉన్న పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు గాను సార్టెడ్ సెక్స్ సెమెన్ (ఎస్ఎస్ఎస్) పద్ధతిని ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చింది. పశుసంవర్ధక శాఖ ప్రవేశపెట్టిన ఎస్ఎస్ఎస్ ద్వారా పశువుల్లో కొత్త శకానికి నాంది పలుకుతోంది. పాడి రైతులు పెంచుకునే గేదేలు లేదా ఆవులకు ఆడదూడలు మాత్రమే పుట్టేందుకు అవకాశం ఉంటుంది. పశువీర్యంలో మగదూడ పుట్టేందుకు కారణం అయిన వై -క్రోమోజోమ్‌ను నిర్మూలించడం జరుగుతుంది. కేవలం ఎక్స్‌ఎక్స్ క్రోమోజోమ్ ఉన్న వీర్యాన్ని పశువుల గర్భంలోకి ప్రవేశపెడతారు. గత కొన్ని నెలలుగా ఈ పద్ధతిలోనే పశువులకు గర్భధారణ చేస్తున్నారు. ఎస్ఎస్ ఎస్ పద్ధతిలో గర్భం దాల్చిన పశువుల్లో 95 శాతం ఆడదూడలకే జన్మనిచ్చినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ వెల్ల డించింది.

పాడి పశువులకు సార్టెడ్ సెక్స్ సెమెన్ (ఎస్ఎస్ఎస్) దోసులతో కొత్త శకానికి నాంది పలకనుంది. ఈ పద్ధతి ద్వారా పశువీర్యంలో మగదూడ పుట్టేందుకు కారణం అయిన వై -క్రోమోజోమ్‌ను నిర్మూలిస్తారు. కేవలం ఎక్స్, ఎక్స్ క్రోమోజోమ్ ఉన్న వీర్యంను మాత్రమే పశువుల గర్భంలోకి ప్రవేశ పెడతారు. గత కొన్ని నెలల నుంచి జిల్లాలో ఆవులు, గేదేలకు ఈ పద్ధతిలో గర్భధారణ చేస్తుండటం సత్ఫలితాన్ని ఇస్తోంది.



ఆవు, గేదెకు సార్టెడ్ సెక్స్ సెమెన్ డోసు ఇస్తున్న దృశ్యం

సాధారణ పద్ధతిలో రూ.40

సాధారణ పద్ధతిలో పశువు గర్భధారణ గావించేందుకు వీర్యం డోసులు ఇస్తుంటారు. అందుకు కేవలం రూ. 40 మాత్రమే ఖర్చు అవుతుంది. ఈ పద్ధతిలో ఆడ, మగ దూడలు సరి సమాన స్థాయిలో జన్మిస్తాయి. ఎస్ఎస్ఎస్ విధానంలో వై-క్రోమోజోమ్‌ను నిర్మూలించడం ఖర్చుతో కూడుకున్న సంగతి.

ఎస్ఎస్ఎస్ డోసులు రూ. 500

కేవలం రూ. 500 కే ఎస్ఎస్ఎస్ రెండు డోసులు పశువులకు వేస్తారు. గేదె, ఆవు ఎదకు వచ్చిన తర్వాత మొదటి డోసు వేస్తారు. అప్పటికీ అది కట్టకపోతే 21 రోజుల వ్యవధిలోనే రెండో డోసు వేస్తారు. అప్పటికి కూడా ఫలితం లేకపోతే పెట్టిన ఖర్చు రూ. 500 వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. ఒకవేళ ఈ డోసులు ఇచ్చిన తర్వాత కూడా మగదూడ పుడితే రూ. 250 పశు సంవర్ధక శాఖ తిరిగి చెల్లిస్తుంది.

95 శాతం ఉత్తమ ఫలితం

ఇప్పటివరకూ గుంటూరు జిల్లాలో 4,974 పశువులకు ఈ డోసులు ఇచ్చారు. వాటిలో 95 శాతం పశువులు ఆడదూడలకు జన్మనిచ్చాయి. సంగం డెయిరీలో కూడా 3,190 పశువులకు ఇదే పద్ధతిలో గర్భధారణ గావించింది.



ఈ ఏడాది లక్ష్యం పదివేలు

గుంటూరు జిల్లాలో 2024-2025 సంవత్సరానికి 10 వేల పశువులకు ఎస్ఎస్ఎస్ పద్ధతిలో గర్భధారణ గావించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటివరకు 2,850 పశువులకు ఈ డోసులు ఇచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. పశుసంవర్ధక శాఖ దీనిపై విస్తృతమైన ప్రచారం చేస్తుంది.

ఇంకెన్నాళ్లు.. రేషన్ డోర్ డెలివరీ

(5వ పేజీ తరువాయి..)

హయాంలో ఎండీయూల ద్వా రా బియ్యం తప్పించి ఇవ్వక పోవడం దానికీ కూడా రోజుల తరబడి ఎదురుచూడాల్సి రావడంతో కార్డుదారులు ఈ విధానంపై అసం తృప్తితో ఉన్నారు.

పెరిగిన బియ్యం అక్రమాలు..

ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాత రేషన్ మాఫియా అక్రమాలు విపరీతంగా పెరిగాయి. మొబైల్ వాహనాలు వచ్చిన తర్వాత వారి అక్రమాలు మరింత సులువయ్యా యి. నేరుగా ఆ వాహనాల్లోనే అక్రమార్కులు పేదల బి య్యాన్ని కొల్లగొట్టి తరలించుకుపోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. అదీ చాలదన్నట్లు అక్రమాలకు అలవాటుపడిన వాహనదారులు, డీలర్లు చాలామంది లబ్ధిదారులకు టోకరా ఇస్తున్నారు. ఇరువురూ కుమ్మక్కై లబ్ధిదారులకు రేషన్ ఎగ వేసేందుకు 'డోర్ డెలివరీ' విధానాన్ని ఒక సాధనంగా మార్చుకున్నారు. సమయానికి కార్డుదారులు లేరన్న నెపం తో రేషన్ ఎగవేసి, దాన్నే ఆదాయ మార్గంగా మార్చుకు న్నారు. ఫలానా రోజు ఫలానా వీధికి వస్తారన్న గ్యారంటీ లేకుండా వారికి ఇష్టమొచ్చిన రీతిలో తేదీలు మార్చి మార్చి వెళుతున్నారు. వాహనం ఎప్పుడు వస్తుందో తెలి యక పనులకు వెళ్లినవారు రేషన్ నష్టపోతున్నారు. దీనికి తోడు వాహనంలో తక్కువ సరుకులు తీసు కువచ్చి కొందరికి సరఫరా చేసి, 'సరుకులు అయిపో యాయి.. మళ్లీ వస్తామని' చెప్పి వెళ్లిపోతున్నారు. తిరిగి ఆ వీధికి వెళ్లకుండా తప్పుకుంటున్నారు. ఫలి తంగా లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వాహనదారులు కుమ్మక్కైన డీలర్లు ఒకరిపై ఒకరు నెపం చూపి లబ్ధిదారులను పదే పదే తిప్పి రేషన్‌ను ఎగవేస్తున్నారు. దీంతో విసిగి వేసారి పోయిన లబ్ధిదారులు రేషన్‌ను వదులు కుంటున్నారు. ఆదాయాన్ని రుచి మరిగిన డీలర్లు, వాహన దారులు అక్రమాలకు ఒడిగడుతున్నారు. ఇదే వాహనాల్లో బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు అనేకం వెలుగుచూస్తున్నాయి.

సిగ్నల్ సమస్య పేరుతో నాటకాలు

రేషన్ డోర్ డెలివరీ, ఎగవేతల విషయంలో లబ్ధిదారులు, వాహనదారులకు మధ్య తరచుగా వివాదాలు జరుగుతున్నాయి. వాహనం ఎక్కడో నిలబెట్టి అక్కడికి రమ్మనడంపై అనేకమంది వాహనదారులను నిలదీస్తున్నారు. ఈ పోస్ మిషన్‌కు సిగ్నల్ రావడం లేదని, అందువల్లే వీధిలో ఒకచోట వాహనాన్ని ఆపి అక్కడికి రమ్మంటున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు.

ఆలపాడు సర్పంచ్ వైసీపీకి రాజీనామా



చుండూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆలపాడు సర్పంచ్ గద్దె విజయలక్ష్మి వైసీపీకి రాజీనామా చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను వైసీపీ నాయకులకు పంపినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంతా తానై ప్రజాభిప్రాయానికి విలువ లేకుండా ఏకపక్షంగా పాలన సాగిందని, దీనివలన గ్రామీణ పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని ఆరోపించారు. పంచాయతీ నిధులను దారి మళ్లించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి వారు ఎంతో తోడ్పడుతున్నారన్నారు. అందువలన ఆమె తన భర్త బోడియ్య, కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీలో చేరుతున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.

చిన్న పరిశ్రమలను ఆదుకోవాలి

- మంత్రి టీజీ భరత్‌కు చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి విజ్ఞప్తి



మంత్రి టీజీ భరత్‌ను సత్కరిస్తున్న యేల్చూరి, వెచ్చా తదితరులు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించాలని ఆదుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్‌ను కోరారు. శుక్రవారం ఆయన వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. వ్యాపారుల సమస్యలను చర్చించటంతోపాటు ప్రభుత్వపరంగా పరిశ్రమలకు అందాల్సిన బకాయిలను గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ఇటీవల చాంబర్ ఎన్నికల్లో విజయం సాధించిన యేల్చూరిని మంత్రి టీజీ భరత్ అభినందించారు. కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి, సీఏ సుబ్బారాయుడు, దేవంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఉన్నతి చంద్రబాబుతోనే సాధ్యం

- మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఉన్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు ప్రశంసించారు. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, తన సోదరుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌తో కలిసి ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం సీఎం చంద్రబాబును కలుసుకున్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక పురోగమన దిశగా నడుపుతున్నారంటూ చంద్రబాబుకు రాయపాటి అభినందనలు తెలిపారు. జగన్ మోహనరెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. చంద్రబాబుకు తమ అభిమానులు, కుటుంబ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాయపాటి ఆరోగ్య పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకొన్నారు.



సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తున్న రాయపాటి సాంబశివరావు, పక్కన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీనివాస్

రైల్వే ట్రాక్‌ల సమీపంలో పతంగులు ఎగురవేయొద్దు

- ప్రాణం మీదికి తెచ్చుకోవద్దు..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ట్రాక్‌ల వద్ద విద్యుదీకరణ పూర్తి
- సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువతకు డీఆర్ఎం ఎం రామకృష్ణ హెచ్చరిక

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు జిల్లా వ్యాప్తంగా పతంగులు (గాలిపటాలు) ఎగురవేయడం తరతరాలుగా వస్తున్నది. అయితే అప్పట్లో రైల్వేట్రాక్‌లు విద్యుద్దీకరణ జరిగి ఉండలేదు. ఇప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని రైలుమార్గాలు విద్యుద్దీకరణ పూర్తి అయి ఉన్న దృష్ట్యా వాటికి సమీపంలో గాలిపటాలు ఎగురవేయడం అత్యంత ప్రమాదకరం. మనిషి ప్రాణాన్ని కూడా బలి తీసుకొనే అవకాశం ఉందని గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. రైలుమార్గాల పైన ఉండే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ తీగెలలో 25వేల వోల్టుల కరెంట్ నిరంతరం సరఫరా జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో వాటికి సమీపంలోకి వెళ్లినా మనిషి మాడి మసైపోయే ప్రమాదం పొంచి ఉంటుంది. అలానే పతంగులకు కట్టేది దారమే కదా... అందులో విద్యుత్ సరఫరా జరగదని భావించడానికి వీల్లేదు. వాటి ద్వారా కూడా విద్యుత్ సరఫరా జరిగి షాక్ కొట్టే అవకాశం ఉందని డీఆర్ఎం తెలిపారు. విద్యుత్ స్తంభాల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లొద్దని సూచించారు. ఈ విషయంలో పెద్దలు తమ పిల్లలకు తగిన జాగ్రత్తలు చెప్పి నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా పొరపాటున విద్యుత్ తీగెలకు గాలిపటాలు, దారం వేలాడుతుంటే సమీపంలోని రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. స్వంతంగా తీసే ప్రయత్నం చేయొద్దని సూచించారు. కాగా గతంలో రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డు సమీపంలో ఇలానే ఒక చిన్న పిల్లవాడు గాలిపటం ఎగురవేస్తూ షాక్‌కు గురై ప్రాణాలు విడిచాడు.


మరోవైపు గాలిపట్టాలను ఎక్కడైనా మైదానాల్లోనే ఎగురవేసుకొంటే ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇంటి మిద్దెల పైనుంచి పతంగులు ఎగుర వేసి దారాలకు మాంజా పూస్తుంటారు. అవి తెగి ఎగురుతూ రోడ్లపైకి వస్తుంటాయి. ఆ సమయంలో మాంజా దారం కనిపించక ప్రాణాలు పోగొట్టుకొన్న సంఘటన కూడా సంగడిగుంటలో జరిగింది. ఇక గాయాలైన సంఘటనలు కూడా జిల్లాలో అనేకం ఉన్నాయి. దీని దృష్ట్యా రైల్వే ట్రాకుల సమీపంలో పతంగులు ఎగురవేయొద్దని డీఆర్ఎం రామకృష్ణ యువకులను హెచ్చరించారు.

రాజధానిలో ఇళ్ల స్థలాల కేటాయింపును వేగంగా పూర్తి చేయండి

సీఎం చంద్రబాబుకు సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, రామకృష్ణ వినతి

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అమరావతి సచివాలయం, అసెంబ్లీ, రాజ్‌భవన్ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, రామకృష్ణలు సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను 1-7-2023 నుంచి అమలు చేయడానికి సంబంధించి, వేతన సవరణ కమిషన్ చైర్మన్‌ను నియమించి మధ్యంత రభృతిని అమలు చేయాలని సచివాలయ ఎస్‌వోల సంఘం రంగస్వామి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సచివాలయ సంఘం మాజీ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, రామకృష్ణలతో కలిసి సీఎంను కలిసి ఉద్యోగుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల చెల్లింపు, సీపీఎస్ ఉద్యోగుల వాటా, ప్రభుత్వం సమానంగా ఇవ్వవలసిన దానితో పాటు నిరంతరం జమ చేయాలని కోరారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, లోన్లు అడ్వాన్స్‌లు, రిటైర్మెంట్ ప్రయోజనాలు మొదలైనవి సీఎఫ్ఎమ్ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లింపు వెంటనే చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డియర్‌నెస్ అలవెన్స్ విడతలు విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ పథకాన్ని రద్దు చేసి సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. సెక్షన్ ఆఫీసర్ నుంచి అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులకు రెగ్యులర్ ప్రమోషన్లను, న్యాయ సంబంధిత సమస్యలను పరిష్కరించచి అమలు చేయాలని, సచివాలయ ఉద్యోగుల సహకార క్యాంటిన్‌కు తగిన మరమ్మత్తులకు అనుమతి ఇవ్వాలని సీఎంకు విన్నవించారు.

108 ఉద్యోగులకు ఊరట



- జీతాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఒక్కో ఉద్యోగికి అదనంగా రూ. 4 వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న సిబ్బంది

పెదకూరపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా, ఏ అనారోగ్య సమస్య తలెత్తినా ప్రాణాపాయ స్థితి వచ్చినా అందరికీ మొదటిగా గుర్తుచ్చేది 108. సంవత్సరాల తరబడి 108 సిబ్బంది వేతనాలు పెంచాలని కోరినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే 108 సిబ్బందికి శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 108 సిబ్బందికి వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవటంతో ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.4 వేలు చొప్పున జీతం పెరగనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 108 సిబ్బంది వేతనాలు పెంచాలని ప్రభుత్వం ఎంతో ఒత్తిడి తెచ్చినా, ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా వారు స్పందించలేదు. ఎన్నికల సమయంలో 108 ఉద్యోగులు తమ వేతనాలను పెంచాలని చంద్రబాబు నాయుడుకు, కూటమి నేతలకు అప్పట్లో వినతి పత్రాలు అందజేశారు. 108 సిబ్బంది సమస్యలపై సానుకూలంగా స్పందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవటంతో 108 ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎంతో సంతోషంగా ఉంది..

- వడ్డె ఆనంద్, 108 డ్రైవర్



108 సిబ్బంది జీతాలు పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవటం సంతోషంగా ఉంది. ప్రభుత్వం 108 సిబ్బంది కష్టాలను, ఇబ్బందులను గుర్తించింది. అందుకే వేతనాలు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. నూతన సంవత్సరంతో మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. జీతాలు పెంచినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

ఫోన్ వచ్చిన వెంటనే వెళ్తాం..

- తుడుము వెంకటరావు, 109 ఈఎంటీ



ప్రమాదం జరిగిందనే విషయంపై ఫోన్ వచ్చిన వెంటనే వెళ్లి అంబులెన్స్‌లో ఎక్కించుకొని ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకువెళ్తాం. పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో 108 అంబులెన్స్ అందుబాటులో ఉంది. ఆ మండలానికి సంబంధం లేకపోయినా ఆ సమయంలో 108 వేరే ప్రాంతానికి వెళ్లినా, మరో మండలం నుంచైనా 108 సిబ్బంది వచ్చి ప్రమాదంలో ఉన్నవారిని తీసుకు వెళ్తారు. కూటమి ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించి వేతనం పెంచటం ఎంతో ఆనందంగా ఉంది.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు లోకేశ్ ప్రజాదర్బార్

తాడేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉండవల్లిలోని నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని లోకేశ్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటలలోపు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దుగ్గిరాల, జనవరి 3,(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవేంద్రపాడు, శృంగారపురం, తుమ్మపూడి గ్రామాల్లో విద్యుత్‌సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్ వసంతరావు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ సరఫరాలో అంతరయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఏసీసీ కార్మికుడు మృతి

తాడేపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏసిసి అక్రమ లాకౌట్ అనంతరం నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్న ఓ కార్మికుడు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు జరిపే న్యాయ పోరాట దీక్షలో నిత్యం పాల్గొంటున్న ఆంధ్ర నాగేశ్వరరావు (69) మృతిపట్ల పలువురు కార్మికులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక వార్డు సచివాలయం వరకు కార్మికులు, కార్మిక సంఘ నేతలు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. సచివాలయ కార్యదర్శికి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. నాగేశ్వరరావు మృతిపట్ల ఏసీసీ కార్మికపోరాట సంఘం కన్వీనర్ కూరపాటి స్టీవెన్, సీపీఎం నేతలు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

తాడికొండలో రెవెన్యూ సదస్సు

తాడికొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తాడికొండలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వార్డు మెంబర్ ఖాజా డీపీవో దృష్టికి తీసుకు వచ్చారు. ఈవోపీఆర్డీ సాయిలీలా, సర్పంచ్ సరోజిని, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీ.హరిబాబు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బూర్ల

క్యాలెండర్ ఆవిష్కరణ

పెదనందిపాడు, జనవరి, 1 (ఆంధ్రజ్యోతి) :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రత్తిపాడు నియోజకవర్గ యూనిట్ క్యాలెండర్‌ను శుక్రవారం గుంటూరులోని టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఈ చెన్నయ్య కె చల్లమ్మ, ఉపాధ్యక్షులు కె జగదీశ్వరి, జాయింట్ సెక్రటరీ జీవీఆర్‌కె మూర్తి సభ్యులు ఎండీ జరీనా పాల్గొన్నారు.

వైసీపీ భూ రీసర్వే బూటకం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



ఫిరంగిపురం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

ఫిరంగిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వే ఒట్టి భూటకమని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పొలం హద్దురాళ్లను సమాధి రాళ్లలా మార్చి వేశారని, రైతుల పాసు పుస్తకాలపై ఆయన ఫోటోలు వేయించుకొని భయ భ్రాంతులకు గురి చేశారన్నారు. నాడు భూ రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తూ నేడు కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహింపచేస్తున్నారన్నారు. 1992లో రేపూడి జోజి అనే రైతు భూమిని కొనుగోలు చేస్తే ఇంతవరకు ఆన్‌లైన్ ఎక్కించకపోవటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ విషయంపై ఫిరంగిపురం సచివాలయం - 1 సర్వేయర్‌ను పిలిచి ఐదు సంవత్సరాల నుంచి సమస్యను ఎందుకు తీర్చలేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో గ్రామంలో 70 వరకు అర్జీలు వచ్చాయంటే యంత్రాంగం పని చేస్తుందా? లేదా? అనేది తెలియటం లేదన్నారు. నెల రోజుల్లో అర్జీలు పరిష్కారం కాకుంటే నేరుగా తన వద్దకే రండని అర్జీదారులకు సూచించారు. సమస్య పరిష్కారం కోసం రైతులు, ప్రజలు ఏ అధికారికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇకనైనా అధికారులు సర్వే నెంబర్లన్నీ లెక్కించుకొని ఆన్‌లైన్‌లో ఎక్కినవి ఎన్ని? ఎక్కాల్సినవి ఎన్ని? అన్న సమాచారంతో అన్నింటినీ సరిచేయాలని ఆయన ఆదేశించారు. మండలంలో భూమి, రెవెన్యూ సమస్యలను ఆరు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఏ అధికారి దగ్గరైతే సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయో వారిపై తగు చర్యలు చేపడతామని హెచ్చరించారు. భారీ సర్వేలో ఒక్కో చోట భూ విస్తరణ తగ్గటం, చెరువులు, అసైన్డ్ భూములు 22ఏ కింద మార్చి రైతులను ఏ మార్చారని దుయ్యబట్టారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీని నెలలోగా పరిష్కరించకుంటే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, నర సింహారావు, కటికల అప్పారావు, బందనాథం జ్యోతి తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మంగళగిరిలో అద్భుతమైన ప్రగతి

● ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో మంగళగిరి నియోజకవర్గం అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవితో కలిసి జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఓడినప్పటికీ ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా మంత్రి నారా లోకేశ్ ఇక్కడి ప్రజల అభిమానాన్ని చూరగొని భారీ మెజార్టీతో గెలుపొందారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం మంచి విజన్‌తో పనిచేస్తున్నారని చెప్పారు. మంగళగిరి మునిసిపల్ మాజీ చైర్మన్‌గా, ఆప్కో మాజీ చైర్మన్‌గా పనిచేసిన గంజి చిరంజీవి జనసేనలో చేరడం శుభపరిణామమన్నారు. గంజి చిరంజీవి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ఎన్నో పోరాటాలు జరిగాయని, మంత్రి నారా లోకేశ్ చొరవతో ఇప్పుడు ఆస్పత్రి నిర్మాణానికి ఆమోదం లభించడం గొప్ప పరిణామమన్నారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీ నేతలను కార్యకర్తలను సమన్వయం చేసుకుని పనిచేస్తానని స్పష్టం చేశారు.

సమావేశంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నేతలు బేతపూడి విజయ్‌శేఖర్, బడే కోమలి, వాసా శ్రీనివాసరావు, సామల నాగేశ్వరరావు, అంబటి తిరుపతిరావు, షేక్ ఖైరుల్లా, షేక్ సుభానీ, దాసరి శివనాగేంద్రం, చిట్టెం అవినాష్, సాయికృష్ణ, తిరుమలశెట్టి మురళీకృష్ణ, బళ్లా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో డ్రోన్ సేవలు శుభపరిణామం

● ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



డ్రోన్ సేవలను పర్యవేక్షిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తదితరులు

మంగళగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో డ్రోన్ సేవల వినియోగం విప్లవాత్మకమైన మార్పు అని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీనుంచి ఎయిమ్స్‌కు డ్రోన్ సేవల పైలట్ ప్రాజెక్టును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ ఇందిరానగర్ యూపీహెచ్‌సీ నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్ కోసం పీఏపీ స్మెర్ నమూనాలను డ్రోన్ సాయంతో రెండు నిమిషాల్లో పంపించడం గొప్ప మైలురాయి అన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మీ, డీఎంహెచ్‌వో కే.విజయలక్ష్మీ మాట్లాడుతూ డ్రోన్ సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేని టెస్టులను ఈ డ్రోన్ సదుపాయం ద్వారా ఎయిమ్స్ ఆసుపత్రిలో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ హెచ్‌వోడీ డాక్టర్ రాజీవ్, డాక్టర్ నవ్యకృష్ణ, డాక్టర్ ధ్రువజ్యోతి దేబ్‌నాథ్, డాక్టర్ అరుంధతి, డాక్టర్ కే.రాజేశ్వరీ, డాక్టర్ అనూష, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత.. ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో ఓ దివ్యాంగుడికి వీల్ చైర్ అవసరం వుందని సిబ్బంది తెలపడంతో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం వీల్‌చైర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు బేతపూడి విజయ్‌శేఖర్, కోమలి, వెంకటమారుతీరావు, శ్రీనివాసరావు,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

దుగ్గిరాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో శుక్రవారం దోస్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మన్యూనతా భావాన్ని వీడి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ, శక్తివంతులుగా ఎదగాలని అన్నారు. పిల్లలు చిన్న, చిన్న అంశాలవైపు ఆకర్షితులై విద్యార్థి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దోస్త్ నిర్వాహకులు ఎన్నారై జంపాల సుబ్బారావు, టీడీపీ నేతలు గూడూరు వెంకట్రావు, మాజీఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, నక్కా చిరంజీవి, హెచ్‌ఎంలు ఎస్. శోభాదేవి, బాలసుందరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణరావుని గెలిపించాలి

మంగళగిరి సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. మంగళగిరి ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. లక్ష్మణరావు గెలుపుకోసం ప్రజాసంఘాల నేతలందరూ గట్టిగా కృషి చేయాలని కోరారు. దుర్గారావు, టీ.అంజనేయులు, వీసం జవహర్‌లాల్, బాలకృష్ణ, రాఘవులు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

కాజలో సంజీవని ఆరోగ్య రథం సేవలు

మంగళగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సంజీవని ఆరోగ్య రథం సిబ్బంది శుక్రవారం మండలంలోని కాజ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 126 మందికి బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ కే.నవీన్ కుమార్, స్టాఫ్ నర్సు సుచిత్ర, ఎం.అరుణ, డి.శాంతి, ఉమాదేవి, అభిరామ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకి నివాళి

మంగళగిరి సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అంటరానితనం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి బాలికా విద్యను ప్రోత్సహించిన సావిత్రిబాయి పూలే మానవత్వానికి ప్రతిరూపమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు.

ఇళ్లను తొలగించవద్దు

తుళ్లూరు, జనవరి 3:(ఆంధ్రజ్యోతి) రోడ్డు నిర్మాణం పేరుతో ఇళ్లను తొలగించవద్దని సీపీఎం నేతలు, బాధితులు పలువురు తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో సీఆర్డీఏ అదనపు కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ ఏబీవీపీ నిరసన

తెనాలి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. గాంధీచౌక్ నుంచి ప్రదర్శనగా మార్కెట్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపైకి చేరుకుని నిరసన తెలిపారు. కొంతసేపు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కమిటీ మెంబర్ వేదశ్రీ మాట్లాడుతూ, ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలలలో వసతుల కల్పనపై తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు. బకాయిలు చెల్లించడంతో పాటు ఎప్పటికప్పుడు రీయింబర్స్‌మెంట్ జమచేయాలని కోరారు. నిరసనలో లోకేశ్, రేవంత్, సుధీర్, సతీష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

టీడీపీ నాయకుడు రవికి తీవ్రగాయాలు

కొల్లిపర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని మున్నంగిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం మున్నంగి గ్రామానికి చెందిన కనపాల రవి గురువారం రాత్రి 10గంటల సమయంలో గ్రామ సమీపంలోని రేపల్లె కాల్వపై ఉన్న వంతెన వద్ద తీవ్ర గాయాలతో పడివుండగా గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేశారు. దీంతో రవిని కుటుంబ సభ్యులు తెనాలి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సం నిమిత్తం మంగళగిరిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు కొల్లిపర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: రావిపాటి

పొన్నూరు టౌన్, జనవరి 3: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల సంఘం సలహాదారుల రావిపాటి అంజనేయులు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం పట్టణంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అంజనేయులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం విశ్రాంత ఉద్యోగులకు రూ.7,500 పెన్షను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి సరికాదన్నారు. తక్షణమే ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. డిపో కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, రీజనల్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రజాక్, కె రెడ్డిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనధికార కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పర్యటనలో భాగంగా వివిధ వార్డులలో పర్యటించినపుడు కొన్నిచోట్ల అనధికార తాగునీటి కుళాయి కనెక్షన్లను గుర్తించామని వాటిని వెంటనే రెగ్యులర్ చేసుకోవాలని, లేకుంటే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి: ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక గంగానమ్మపేటలోని 35, 36వ వార్డులలో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలోని వ్యర్థాలను చూసి శానిటేషన్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు తాడిబోయిన బ్రహ్మేశ్వరావు, గొడవర్తి హరేరాం, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, డీఈ కె శ్రీనివాసులు, టీపీవో సాంబశివరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నజీర్, ఏఈ జానీబాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నన్నపనేని రాజకుమారిని సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం

నన్నపనేని రాజకుమారికి సత్కారం

తెనాలి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారిని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్, కనగాల నాగభూషణం కలిసి ఆమెను సత్కరించారు. శుక్రవారం ఐతానగర్‌లోని రాజకుమారి ఇంటివద్దకు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

మైనార్టీల సమస్యలపై దృష్టి సారించాలని మంత్రికి వినతి

పొన్నూరు టౌన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కోరినట్లు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిని పొన్నూరు మైనార్టీ నాయకులు శుక్రవారం కలిశారు. మైనార్టీ సంక్షేమ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారుక్ షబ్లి ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ సమితి రూపొందించిన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి ఫరూక్‌కు ఎన్టీఆర్ బొమ్మను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ ఖాదీర్ మెమన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమ ఏపీకి తరలివచ్చేందుకు చర్యలు తీసుకోవాలి: దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ పరిశ్రమ ఏపీకి తరలి వచ్చేందుకు రూట్‌మ్యాప్ రూపొందించాలని ఏపీ మా వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా కోరారు. సుల్తానాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. అమరావతి పూర్తయితే షూటింగ్‌లన్నీ ఇక్కడ జరుపుకోవచ్చని ముఖ్యమంత్రి చెప్పారని, అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న స్టూడియోల నిర్మాణాన్ని సమీక్షించాలని, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, చిత్ర నిర్మాణానికి అనువైన ప్రదేశాలని, వాటిపై కూడా దృష్టి పెట్టాలని కోరారు. నరేష్, మణివరణ్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

తెనాలి, మారీసుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక రామలింగేశ్వర పేటలోని ఏపీ బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు, సంఘ నాయకులు కుర్రా శ్రీను, కె.హనుమంతరావు, వేముల కృష్ణ, వెంకట శివకల్యాణి, హేమలత, శివరామకృష్ణ, రాహుల్, రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో...

తెనాలి, మారీసుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పాల్గొని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం తన జీవితాన్ని త్యాగంచేసిన వీరవనిత సావిత్రీబాయి పూలే అన్నారు. కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, పణిదపు దుర్గ, ఖుద్దుస్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, బోయపాటి అరుణ, దివి అనిత, కొండా రమాదేవి, అన్నం పిన్నారావు, పావులూరి రాంబాబు, మల్లవరపు విజయ్‌కుమార్, వెంకట్, అశోక్ వసంతం, కుదరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఎంఈవో ఆరిమండ బసవకుటుంబరెడ్డి మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహిళల కోసం పాఠశాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. బ్రిటీషు కాలంలో సావిత్రీబాయి పూలే అందరి మన్ననలు పొంది, ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందినట్లు పేర్కొన్నారు. పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షుడు బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులందరూ సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను మాజీ ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు భూపతినాయుడు, శంకర్‌రావు, నాయక్, ప్రశాంతరావు తదితరులు పాల్గొన్నారు.



లుంబినీ వనంలో సావిత్రీబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న కత్తి స్వర్ణ కుమారి తదితరులు

● తెనాలి అర్బన్: ఏపీ నవ చైతన్య సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లో శుక్రవారం మేడిబోయిన గంగ, భీష్మా పాములు, ప్రవీణ్, యలమంద తదితరులు పూలే సేవలను కొనియాడారు.

● పొన్నూరు టౌన్, చేబ్రోలు: విద్య అవశ్యకతను గుర్తించి దేశంలోనే తొలిసారిగా మహిళా విద్యను ప్రోత్సహించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని టీడీపీ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అఖిలపక్ష నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే స్త్రీ విద్య అవశ్యకతను పూలే దంపతులు గుర్తించారన్నారు. మహిళలు విద్యలో రాణిస్తే కుటుంబ ప్రగతి సాధ్యమని గుర్తించి మహిళా విద్యాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, బండ్లమూడి బాబురావు, పఠాన్ అహ్మద్‌ఖాన్, ఫైరోజ్‌ఖాన్, తోట ప్రసాద్, తానికొండ దుర్గయ్య, అమ్మవారి వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాకాని రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సీవీఎస్ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనికుమారి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. పట్టణంలోని కత్తిపద్మారావు నివాస గృహం లుంబినీవనంలో సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలు జరిగాయి. కత్తి స్వర్ణ కుమారి ఆధ్వర్యంలో మహిళలు సావిత్రీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలు జరిగాయి, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ బీసీ నాయకులు

● తెనాలి అర్బన్: మండల వనరుల కేంద్రంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎంఈవో లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీటీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. గురిందపల్లి వేమయ్య, బాలాజీ, బాబు, ప్రసూన, జైపాల్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లలో భద్రతా నిబంధనలు పాటించాలి

● ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్

తెనాలి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలను పాటించాలని ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని వీఎస్సార్ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంక్‌ను ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు ఆకస్మిక తనిఖీ చేశారు. వినియోగదారులకు అందించాల్సిన సౌకర్యాలు, ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేలపాడులో డొంక సమస్యపై...

నేలపాడులో రైతులు ఎదుర్కొంటున్న డొంక సమస్యపై ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అవరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



రైతులు తెలిపిన డొంక సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

విజయ్‌కుమార్ మృతి బాధాకరం

● పిల్లి మాణిక్యాలరావు

తెనాలి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయ్‌కుమార్ మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు అన్నారు. గురువారం రైలు ప్రమాదంలో మృతి చెందిన కొలకలూరు గ్రామానికి చెందిన సినీరచయిత మోదుకూరి జాన్సన్ సోదరుడి కుమారుడు మోదుకూరి విజయ్‌కుమార్ (45) మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు ధైర్యంచెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

చేబ్రోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధుల నుంచి తొలగించిన కార్మికుల నిరసన శుక్రవారం కొనసాగింది. పంచాయతీ కార్యాలయం వద్ద రహదారిపై కార్మికులు బయట నుంచి నిరసన తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు టెండర్ల రెన్యూవల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలి

● విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జనార్ధనరెడ్డి

కొల్లిపర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాల వ్యవస్థను రక్షించుకునేందుకు హిందువులంతా ఏకం కావాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వంగా జనార్ధనరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధనరెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుంచి హిందువులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు జగన్నాధాచార్యులు, కొండా కిశోర్‌రెడ్డి, వంగా సాంబిరెడ్డి, వీరభద్రరావు, శివరామకృష్ణశర్మ, వంగా మనోహర్‌రెడ్డి, రెడ్డి వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ధనుర్మాస ఉత్సవాలలో కుంకుమ పూజలు

తెనాలి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జయప్రకాష్‌నగర్‌లో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలలో శుక్రవారం కుంకుమ పూజలు జరిపారు. శరణగతి ఘోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో నరేంద్ర రామానుజ దాసస్వామి మహిళలతో కుంకుమ పూజలు చేయించారు.

● తెనాలి అర్బన్: బోసురోడ్డులోని రామాలయంలో ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు ప్రతిరోజు పారాయణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం గొబ్బెమ్మలు ఏర్పాటుచేసి పూజలు చేశారు. అర్చకులు నరసింహాచార్యులు పర్యవేక్షించారు.

పెన్షనర్ల సంక్షేమానికి అసోసియేషన్ కృషి అభినందనీయం: పినపాటి

తెనాలి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంక్షేమానికి సంఘ నాయకులు చేస్తున్న కృషి అభినందనీయమని గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్ చెప్పారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు మాతంగి సత్యసాగర్‌లను శుక్రవారం పెన్షనర్ల అసోసియేషన్ హాలులో జాషువా జీవితకాల సాఫల్య పురస్కారంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హృదయరాజు, నండూరి నారాయణరావు, సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం ● 4 జనవరి 2025

శాకాలు... పోషకాల నిధులు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

"మూల పత్ర కరీరాగ్ర ఫల కాండాధిరూఢకా
త్వక్ పుష్పం కవకంచేతి శాకం దశవిధం స్మృతమ్"

అంటాడు భోజన కుతూహల రచయిత రఘునాథ సూరి. ఆహారంలో శాకాలది ప్రధానమైన భాగస్వామమని దీని అర్థం. దుంప కూరలు, ఆకు కూరలు, చిగుర్లు, పండ్లు, కాయలు, కాడలు, మొలకలు, బెరళ్లు, పూలు, పుట్టగొడుగులు.. వీటిని మనం తరచూ తింటూ ఉంటే ఆరోగ్యంగా ఉండగలుగుతాం. ఇప్పుడు మనం వీటిగురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

శాకాలలో చాలా పోషకపదార్థాలు ఉంటాయి. ఇవి రూపం మారినప్పుడు వాటిలో పోషక విలువలు కూడా మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక గింజను నానబెట్టి వుంచితే మొలకలొస్తాయి. ఈ మొలకల నుంచి కూరగాయలు పండుతాయి. మొలకలలో పోషక విలువలు.. కూరగాయల్లో పోషక విలువలు వేర్వేరుగా ఉంటాయి. అయితే ఈ శాకాలను తినే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఒకే రకం కూరగాయని విడవకుండా తింటే అస్థిభేదక (ఎముకలు దెబ్బతినటం). నేత్రశక్తి నాశక (కంటి చూపు మందగించటం), రక్తశుక్ర నాశక (రక్త కణాల్ని, పురుషుల్లో జీవకణాల్ని నశింపచేయటం), ప్రజ్ఞాక్షయం (మేధశక్తిని హరిస్తుంది), పాలిత్యకారక (జుట్టు నెరిసిపోతుంది), స్మరణ శక్తి నాశక (జ్ఞాపక శక్తిని నశింప చేస్తుంది) అని భావప్రకాశ అనే ఆయుర్వేద గ్రంథం వివరించింది. కాబట్టి ప్రతి రోజూ ఒకే రకం కూరగాయలు కాకుండా ఒక రోజు దుంపకూర, ఒకరోజు ఆకు కూర, ఒకరోజు కాయగూర ఇలా ఆరు రకాల్నీ మార్చిమార్చి తినాలనేది ఆయుర్వేద నిపుణుల చెబుతూ ఉంటారు. దీనికి తగిన విధంగానే మన ఆహార ప్రణాళిక కూడా ఉండాలి. అంతే కాకుండా శరీర తత్వానికి ఏది మంచిదో దానినే తినాలి. లేకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.

క్యారెట్, ముల్లంగి, కీరా, టమోటా లాంటి శాకాల్ని వండకపోయినా తేలికగానే అరుగుతాయి. తక్కిన కూరగాయల్ని సుపక్వంగా అంటే చక్కగావండుకొని తినటమే మంచిది.



ఈ మధ్యకాలంలో కూరల్లో కూరగాయలు తక్కువగా ఉంటున్నాయి. మసాలా గ్రేవీ లేదా చింతపండు రసం వంటివి సింహ భాగం కనిపిస్తున్నాయి. శాస్త్ర ప్రకారంలో కూరలో- కూరగాయ ముక్కలు ఎక్కువగా ఉండాలి. పోపు లేదా మసాలా తక్కువగా ఉండాలి. పోపు లేదా మసాలా వాసన కూరగాయలకు సహజంగా వచ్చే రుచిని చంపేయకూడదు.

తెల్లని దంతాలకు...

తెల్లగా మెరిసే దంతాలు అందంగా కనిపించడమే కాదు నోటి ఆరోగ్యానికి చిహ్నం కూడా. సమస్య వచ్చినప్పుడు చాలామంది రసాయనాలతో కూడిన చికిత్సలను ఆశ్రయిస్తుంటారు. వీటివల్ల పళ్ల మీద ఎనామిల్ పొర దెబ్బతినే అవకాశం ఉంది. అలాకాకుండా సహజ రీతిలో దంతాలను తెల్లగా మెరిపించే చిట్కాల గురించి తెలుసుకుందాం!



ఆయిల్ పుల్లింగ్

● ఇది ఆయుర్వేద విధానం. నోటిలో రెండు చెంచాల నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనె వేసుకుని ఇరవై నిమిషాలపాటు పుక్కిలించి ఆ తరవాత ఉమ్మివేయాలి. తరచూ ఇలా చేస్తుంటే నోటిలోని హానికారక సూక్ష్మజీవులు నశించిపోతాయి. నోటి కండరాలు బలోపేతమవుతాయి. చిగుళ్లకు రక్త ప్రసరణ జరుగుతుంది. దంతాలమీద పేరుకున్న పాచి, ఇతర పదార్థాల అవశేషాలు క్రమంగా కరిగిపోతాయి.

వేప పుల్ల...

● లావుగా ఉండే వేప పుల్లను తీసుకొని దాని కొనను నమిలి బ్రష్‌లా చేయాలి. ఇలా నములుతున్నపుడు నోటిలో ఊరే లాలాజలాన్ని ఉమ్మివేయాలి. చిగుళ్లను, దంతాలను మెల్లగా తోమాలి. వేప పుల్ల నుంచి వెలువడే యాంటీ బ్యాక్టీరియల్ దంతాలపై పేరుకున్న పాచిని తొలగిస్తుంది. ఇలా రోజూ చేస్తూ ఉంటే దంతాలు తెల్లగా ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన, దంతక్షయం లాంటి సమస్యలు రావు.

ముత్యాల ముగ్గు



11 చుక్కలు 6



చందన
తణుకు

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

వంటిల్లు



ముల్లంగిని దక్షిణభారత దేశంలో కన్నా ఉత్తర భారత దేశంలో ఎక్కువగా తింటారు. శీతాకాలంలో పండే ఈ దుంప చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఈ వారం ముల్లంగితో చేసే కొన్ని వంటలు నేర్చుకుందాం...

ముల్లంగితో రుచి రుచిగా

ముల్లంగి కూర

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి కోరు- రెండు కప్పులు, తరిగిన టమోటా ముక్కలు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, ఆవాలు- ఒక చెంచా, శనగపప్పు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, కరివేపాకు- ఒక చెంచా, తరిగిన కొత్తిమీర- ఒక చెంచా, పల్లిల పొడి- నాలుగు చెంచాలు, నువ్వులు- రెండు చెంచాలు, పచ్చిమిరపకాయ ముక్కలు- ఒక చెంచా, వెల్లుల్లి రెబ్బలు- రెండు, ఇంగువ- తగినంత, ఉప్పు- తగినంత, పసుపు- అరచెంచా, కారం- అర చెంచా, నూనె- నాలుగు చెంచాలు, నీళ్లు- తగినన్ని.


తయారీ విధానం

- ఒక మూకుడులో నూనెను వేడి చేసి జీలకర్ర, ఆవాలు, శనగపప్పు, మినపప్పులను వేయించాలి. అవి వేగిన తర్వాత కరివేపాకు, పచ్చిమిరపకాయ ముక్కలను కూడా వేసి వేయించాలి.
- ఆ తర్వాత టమోటా ముక్కలు, ఇంగువ, కారం కలిపాలి. టమోటా ముక్కలు పచ్చి వాసన పోయే దాకా వేగనివ్వాలి.
- ఈ మిశ్రమంలో ముల్లంగి కోరును వేయాలి. ఈ మిశ్రమం దగ్గర పడిన తర్వాత పల్లీల పొడి, నువ్వులు, ఉప్పు కలపాలి.
- మూకుడు మీద నుంచి కిందకు దింపే ముందు కొత్తిమీర వేయాలి.



జాగ్రత్తలు

- పచ్చి ముల్లంగికి కొద్దిగా వాసన ఉంటుంది. కానీ ముల్లంగి కోరును వేయిస్తే పోతుంది.
- హైబ్రీడ్ టమోటాల కన్నా దేశవాళి టమోటాలను వాడితే బావుంటుంది.
- పల్లీల పొడి బదులుగా కొబ్బరి కోరును కూడా వాడవచ్చు.



ముల్లంగి సలాడ్

కావాల్సిన పదార్థాలు:

ముల్లంగి ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన బీన్స్- ఒక కప్పు, పళ్ల ముక్కలు- ఒక కప్పు, నిమ్మకాయ రసం- రెండు చెంచాలు, ఆవపిండి- ఒక చెంచా, తేనె- ఒక చెంచా, సోయా సాస్- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, ఆవ నూనె- పావు చెంచా, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ఒక గిన్నెలో ముల్లంగి ముక్కలు, ఉడికించిన బీన్స్, పళ్లముక్కలను బాగా కలపాలి.
ఆ మిశ్రమంలో నిమ్మకాయ రసం, ఆవపిండి, సోయా సాస్ వేసి కలపాలి.
- దానిపై మిరియాల పొడి, ఆవ నూనె, ఉప్పు వేసి కలపాలి. ఈ సలాడ్ సూప్‌లో బావుంటుంది.

జాగ్రత్తలు

- కొందరు ముల్లంగి ముక్కలను నూనె లేదా నెయ్యిలలో వేయిస్తారు. దీని వల్ల ఈ ముక్కలు దోరగా అవుతాయి.
- కొందరు సలాడ్‌లో బూందీ మిక్సర్‌ను కలుపుతారు. దీని వల్ల అదనపు రుచి వస్తుంది.

ముల్లంగి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి ముక్కలు: ఒక కప్పు, ఎర్ర ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, తెల్ల వెనిగర్: ఒక కప్పు, పంచదార- అర కప్పు, ఆవాలు- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, లవంగాలు- ఆరు

తయారీ విధానం

- ఒక మూకుడులో తెల్ల వెనిగర్, పంచదార, ఆవాలు, మిరియాల పొడి వేసి- పంచదార కరిగే దాకా వేడిచేయాలి.
- ఆ తర్వాత ఆ మిశ్రమంలో ముల్లంగి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఒక నిమిషం తర్వాత దింపేయాలి.
- ఈ మిశ్రమం బాగా చల్లారిన తర్వాత ఒక గ్లాస్ జార్‌లో వేయాలి. దానిలో లవంగాలు వేయాలి.

జాగ్రత్తలు

- ముల్లంగి, ఉల్లిపాయ ముక్కలను ఎక్కువ వేడి చేయకూడదు. ఎక్కువ వేడి చేస్తే చెడు వాసన వచ్చే ప్రమాదం ఉంది.
- ఈ పచ్చడి బాగా చల్లారిన తర్వాత కానీ ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఇది రెండు వారాల దాకా నిల్వ ఉంటుంది.



మచ్చలు మటుమాయం చేసేలా...

ముఖం మీద మొటిమలు, గాట్లు, పుట్టుమచ్చ ల్లాంటి వాటిని దాచేయాలంటే, కొన్ని మేకప్ మెలకువలు అనుసరించాలి. అవేంటో తెలుసుకుందాం!

కన్‌సీలర్‌తో: మచ్చల రంగును బట్టి వాటిని కనిపించకుండా చేసే కన్‌సీలర్ ఎంచుకోవాలి. మచ్చ ఎర్రగా ఉండే గ్రీన్ టింట్ కలిగి ఉండే కన్‌సీలర్ అద్దుకోవాలి. నల్లగా ఉంటే, ఎరుపు రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. ఇందుకోసం మేకప్ స్పాంజ్‌తో ఈ కన్‌సీలర్ పలుచగా అద్దుకుని, ఆ తర్వాత సాధారణ కన్‌సీలర్‌ను మచ్చ ఉన్న ప్రదేశంలో అద్దుకోవాలి. ఇందుకోసం మేకప్ స్పాంజ్ మీద కన్‌సీలర్ వొంపి, మచ్చతో పాటు, దాని చుట్టూరా అద్దుకోవాలి.

మేకప్



ఫౌండేషన్ ఇలా: కన్‌సీలర్ అద్దుకున్న తర్వాత మేకప్ స్పాంజ్‌తో ఫౌండేషన్ పూసుకోవాలి. అసహజమైన గీతలు కనిపించకుండా, ముఖం మొత్తం ఫౌండేషన్ సమంగా పరుచుకునేలా స్పాంజ్‌తో అద్దుకోవాలి. తర్వాత మేకప్ దవడ ఎముక దిగువ వరకూ బ్లెండ్ చేయాలి. తర్వాత పెద్ద బ్రష్‌తో లూజ్ మ్యాట్ పౌడర్‌ను తీసుకుని, వృత్తాకారంలో ముఖం మీద అద్దుకోవాలి. మచ్చ మీద పౌడర్ పరుచుకోవడం వల్ల, అది చర్మంలో కలిసిపోతుంది.

ఎన్నారైల మానసిక సమస్యలు- పరిష్కారాలు



ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ స్రవంతి ఉత్పల ఇంటర్వ్యూ
మీ ఏబీఎన్ యూట్యూబ్ ఛానల్‌లో

తండ్రి ఆస్తిపాస్తులకే కాదు... ఆయన ఆశయాలకు కూడా వారసురాలిగా నిలిచింది సారా టెండూల్కర్. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తెగా ఆమె ప్రపంచానికి సుపరిచితురాలు. కానీ నాన్న నీడలో కాకుండా స్వశక్తితో ఎదిగి... తనదైన బాటను నిర్మించుకొంటోంది. ప్రముఖ బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సారా... మోడల్‌గానే కాకుండా సామాజిక సేవ వైపూ అడుగులు వేస్తోంది. 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్' డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి... ఆపన్నులకు అండగా నిలుస్తోంది.

మన సారా మంచి కోసం



యువ

క్రికెట్ దేవుడు సచిన్ కుమార్తె సారా టెండూల్కర్ ఇప్పుడు ఇంటర్నెట్ సంచలనం. షార్ట్ రీల్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్.. రోజూ ఎక్కడో అక్కడ కనిపిస్తూనే ఉంటుంది. భారత క్రికెట్ స్టార్ శుభ్‌మన్ గిల్ ప్రేయసి అంటూ 27 ఏళ్ల సారా గురించి కొన్ని మాధ్యమాలు ఊదరగొడుతున్నాయి. అందులో వాస్తవం ఎంతనేది పక్కన పెడితే... దీనివల్ల ఆమెకు ఊహించని ప్రచారం లభించింది. కోట్ల మంది అభిమాన తార అయింది. ముంబయిలో పుట్టి పెరిగిన సారా... 'ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదివింది. 2018లో యూకేలోని 'యూనివర్సిటీ కాలేజీ లండన్' (యూసీఎల్) నుంచి బయోకెమికల్ సైన్స్ పట్టా పొందింది. అదే కాలేజీలో క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్‌తో 2023లో ఎంఎస్సీ పూర్తి చేసింది. తరువాత భారత్‌కు తిరిగివచ్చింది. యూకే 'అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్'లో రిజిస్టర్డ్ న్యూట్రిషనిస్టు. పోషకాహార నిపుణురాలిగా కొనసాగాలన్నది ఆమె నిర్దేశించుకున్న లక్ష్యాల్లో ఒకటి. తమ్ముడు అర్జున్ టెండూల్కర్ క్రికెటర్. అమ్మ అంజలి వైద్యురాలు.

అదే ఆమె ఆకాంక్ష...

సచిన్ నీడలో కాకుండా.. స్వయంకృషితో ఎదిగి, తనదైన ముద్ర వేయడానికి సారా తాపత్రయపడుతోంది. ఎక్కడకు వెళ్లినా టెండూల్కర్ కూతురుగా కాకుండా తనను తనుగా గుర్తించాలనేది ఆమె ఆకాంక్ష. అందుకే తనకు నచ్చినట్టు కెరీర్‌ను మలుచుకొనే ప్రయత్నం చేస్తోంది. అందుకు ఆమె తల్లితండ్రులు కూడా పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఏదికావాలన్నా సమకూరుస్తున్నారు. ఆ క్రమంలోనే ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన సారాకు ఆరంభంలోనే మంచి స్పందన లభించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పుడామెకు 75 లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అందుకే బడా బ్రాండ్లు సారా వెంట పడుతున్నాయి. తన దైనందిన జీవిత విశేషాలు, కుటుంబం, స్నేహితులు, సన్నిహితులతో కలిసి విహార యాత్రల్లో ఆస్వాదిస్తున్న మధుర క్షణాలకు సంబంధించిన చిత్రాలు, చిన్న చిన్న వీడియోలను ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటుంది. వాటితోపాటు 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్' (ఎస్‌టీఎఫ్) చేపట్టే కార్యక్రమాలు, దానితో కలిసి పని చేస్తున్న పలు సంస్థల వివరాలు, తను ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ప్రకటనలను అక్కడ పంచుకొంటోంది.

ఫిట్‌నెస్ తరువాతే ఏదైనా...

ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సారా జిమ్‌కు వెళ్లడం మాత్రం మానదు. ఆమెకు ఫిట్‌నెస్ తరువాతే ఏదైనా. సెలవు రోజుల్లో అయినా, ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తున్నా... దగ్గర్లోని జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేస్తుంది. ఇటీవల తమ్ముడు అర్జున్‌తో కలిసి విహార యాత్రకు దుబాయ్ వెళ్లిన ఆమె... ఫిట్‌నెస్‌ను మాత్రం మరిచిపోలేదు. ఉదయం లేవగానే కొంత సమయం కసరత్తులకు కేటాయించింది. ఆహార విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది. చర్మ సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుంది. పలు చర్మసౌందర్య ఉత్పత్తుల ప్రకటనల్లో కూడా నటించింది. భారతీయ సంప్రదాయ వంటలతో పాటు ఇటాలియన్ రుచులంటే ఆమెకు ఇష్టం. బాలి, ఇటలీ నచ్చిన పర్యాటక ప్రాంతాలు. సారా జంతు ప్రేమికురాలు కూడా. పిల్లులు, అరుదైన చేపలు పెంచుకొంటోంది. రెండు మేలు జాతి కుక్కలు కూడా ఇంట్లో ఉన్నాయి.

> **మనం ఎదగడమే కాదు... మనం జీవిస్తున్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలనేది సారా అభిమతం. ఇటీవల తండ్రి నెలకొల్పిన 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆ దిశగా తొలి అడుగు వేసింది.**



సామాజిక చైతన్యం...

మనం ఎదగడమే కాదు... మనం జీవిస్తున్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలనేది సారా అభిమతం. ఇటీవల తండ్రి నెలకొల్పిన 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆ దిశగా తొలి అడుగు వేసింది. 'ఈ కొత్త పాత్రలో సారాను చూస్తుంటే నాకు గర్వంగా ఉంది. ప్రజలకు, సమాజానికి చేయూత అందించడంలో తను ఎప్పుడూ ముందుంటుంది. మా ఫౌండేషన్‌ను మరో ఎత్తుకు తీసుకెళుతుందన్న నమ్మకం నాకు ఉంది. వైద్య రంగంపై ఉన్న పరిజ్ఞానం సమాజ సాధికారతకు మరింతగా తోడ్పడుతుంది' అంటూ ఈ సందర్భంగా సచిన్ తన ట్వీట్ చేశారు.

'మా నాన్న చేపట్టిన ఈ అద్భుతమైన పనిలో భాగమై, సమాజంలో మార్పు తీసుకురావడానికి నేను కూడా దోహదపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సారా పేర్కొంది. మారుమూల పల్లె ప్రాంతాల్లోని పిల్లలకు వైద్య సేవలు అందిస్తూ, పోషకాహార లోపాన్ని అధిగమించేలా ఈ ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతుంది. క్రీడలు, విద్య, ఆరోగ్య సంరక్షణ ద్వారా వారిని సమున్నతంగా నిలిపేందుకు కృషి చేస్తోంది.

ప్రత్యేక సమయం...

ఎస్‌టీఎఫ్ డైరెక్టర్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి సారా ప్రత్యేక సమయం కేటాయిస్తోంది. మోడల్‌గా, న్యూట్రిషనిస్టుగా తన కెరీర్‌కు సంబంధించిన అంశాలతో పాటు ఫౌండేషన్ కార్యక్రమాలు కూడా చూసుకొంటోంది. తరచూ మారుమూల గ్రామాలకు వెళ్లి, అక్కడి పిల్లలతో మమేకం అవుతోంది. ఈ మధ్య తల్లితో కలిసి రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని గ్రామానికి వెళ్లింది. 'అక్కడి అణగారిన వర్గాలకు చెందిన చిన్నారులను కలిశాను. వారి ఆరోగ్య సంరక్షణకు క్లినిక్స్ నెలకొల్పాం. పోషకాహారం అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం. ఆ పర్యటన అర్థవంతంగా ముగిసినందుకు సంతృప్తిగా ఉంది' అంటూ తన సంతోషాన్ని పంచుకుంది. మరింతమంది చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధికి తన వంతు సహకారం అందించే దిశగా భవిష్యత్తు ప్రణాళికలు రచించే పనిలో సారా నిమగ్నమైంది.